సాక్షి హైదరాబాద్

శనివారం । 12 । ఆగస్టు । 2023



ఫేక్ కాల్‌సెంటర్ల గుట్టురట్టు

మాదాపూర్‌లో రెండు ఫేక్ ఇంటర్నేషనల్ కాల్ సెంటర్ల గుట్టు రట్టు చేశామని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. -2లో



హాఫీజ్‌పేట్‌లో చెడ్డీ గ్యాంగ్ కదలికలు?

మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. -2లో

స్టీల్‌బ్రిడ్జికి లోడ్ టెస్టు షురూ

సాక్షి,సిటీబ్యూరో: ఇందిరాపార్కు నుంచి వీఎస్టీ వరకు నిర్మించిన స్టీల్ బ్రిడ్జికి లోడ్ టెస్టును అధికారులు శుక్రవారం ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు బరువుతో కూడిన వాహనాలతో లోడ్ టెస్ట్‌ను నిర్వహించి, బరువును తట్టుకునేలా ఉన్నట్లు సంబంధిత పరీక్షలతో నిర్ధారిస్తారు. లోడ్ టెస్టుతో బ్రిడ్జి దృఢత్వాన్ని నిర్ధారించుకున్నాకే ప్రారంభోత్సవం చేస్తారు. గతంలో దుర్గం చెరువు కేబుల్‌బ్రిడ్జిని సైతం లోడ్‌టెస్ట్ తర్వాతే ప్రారంభించారు.

న్యూస్‌రీల్

ఎస్‌ఆర్‌డీపీ కోసం 33 ఎకరాల కేటాయింపు



ప్రత్యేక బోర్డు సమావేశంలో పాల్గొన్న అధికారులు

కంటోన్మెంట్: స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఎస్‌ఆర్‌డీపీ) కోసం సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని 157 ఎకరాల రక్షణ భూములు అప్పగించనున్నట్లు సీఈఓ మధుకర్ నాయక్ వెల్లడించారు. ఈ మేరకు సికింద్రాబాద్ సర్కిల్ డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్ (డీఈఓ) అంగీకార పత్రాన్ని ఉన్నతాధికారులకు పంపించినట్లు చెప్పారు. ఇందులో కంటోన్మెంట్‌కు చెందిన 33 ఎకరాలకు బోర్డు తీర్మానం ద్వారా ఆమోదం తెలిపామన్నారు. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్ నేతృత్వంలో సీఈఓ మధుకర్ నాయక్, సికింద్రాబాద్ సర్కిల్ నూతన డీఈఓ భూపతి రోహిత్ పాల్గొన్నారు. కాగా.. ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖ భూములు ఇవ్వడం లేదంటూ కొన్నేళ్లుగా మంత్రి కేటీఆర్ చేస్తున్న దుష్ప్రచారం వెల్లడైందని బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ (ఆర్కే) అన్నారు. కేవలం సర్వీసు చార్జీల చెల్లింపు ఇష్టంలేకే రాష్ట్ర ప్రభుత్వం ఇంతకాలం తాత్సారం చేస్తూ వచ్చిందని ఆరోపించారు.

పంద్రాగస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు

- డీజీపీ అంజనీకుమార్



గోల్కొండ: గోల్కొండ కోటలో పంద్రాగస్టు ఏర్పాట్లను అధికారులు పకడ్బందీగా చేయాలని డీజీపీ అంజనీ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో కోటలోని రాణిమహల్ ప్రాంగణంలో పంద్రాగస్టు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. వీవీఐపీలు, వీఐపీల వాహన రూట్, పార్కింగ్ పాసులను సరైన సమయంలో అందజేయాలన్నారు. కోటకు వచ్చే మార్గాలన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆక్టోపస్ విభాగం వారు పతాకావిష్కరణ వేదిక పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఆయన వెంట జలమండలి ఎండీ దానకిషోర్, ఐపీఎస్ అధికారులు స్వాతిలక్రా, నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ ఉన్నారు.

31న జర్నలిజం, డేటా సైన్స్ కోర్సుల పీజీ ఎంట్రన్స్

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సీపీజీఈటీ-2023లో భాగంగా ఈ నెల 31న ఎంఏ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, ఎమ్మెస్సీ డేటా సైన్స్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. జర్నలిజం ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు కొత్తగా హాల్ టికెట్లు తీసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈ నెల 28 నుంచి www.osmania.ac.in వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కేవలం హైదరాబాద్, వరంగల్‌లలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

జీహెచ్‌ఎంఈయూ సమ్మె నోటీసు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు దీర్ఘకాలికంగా ఉన్న తమ డిమాండ్లను వారం రోజుల్లోగా పరిష్కరించని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో పనులు నిలిపివేసి సమ్మె చేయనున్నట్లు జీహెచ్‌ఎంఈయూ అధ్యక్షుడు యు.గోపాల్ తెలిపారు. ఈమేరకు కమిషనర్‌కు సమ్మె నోటీసు పంపించినట్లు, శాశ్వత ఉద్యోగులకు ఇళ్లస్థలాలు తదితర డిమాండ్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో జాప్యం

- కారణం నువ్వంటే.. నువ్వంటూ ఆరోపణలు
- ఉప్పల్ ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎమ్మెల్యే
- సుభాష్‌రెడ్డి, ప్రభాకర్‌ల మాటల తూటాలు



నిలిచిపోయిన కారిడార్ పనులు (ఫైల్)

కారిడార్ వార్!

ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల జాప్యానికి కారణం నువ్వంటే నువ్వంటూ స్థానిక ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌ల మధ్య పొలిటికల్ వార్‌కు తెర లేచింది. కారిడార్ పనుల్లో జాప్యంతో పాటు రోడ్డును బాగు చేయాలని స్థానికుల నుంచి అనేక మార్లు డిమాండ్లు, వినతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరుకున్నాయి. అయినా ఆరేళ్లుగా ఈ సమస్యను గాలికొదిలేశారు. పర్యవసానంగా ఉప్పల్ చౌరస్తా నుంచి నారాపల్లి వరకు దాదాపు 7 కిలోమీటర్ల రహదారి ఆరు సంవత్సరాలుగా ప్రజలకు, ప్రయాణికులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. ఈ దారి కేవలం ఈ ప్రాంత ప్రజలకే కాదు భూపాలపట్నం జాతీయ రహదారి కావడంతో అనేక రాష్ట్రాల ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది. దీంతో ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ఇటీవల కేంద్ర రహదారుల శాఖ మంత్రి గడ్కరీని కలిసి సమస్యను వివరించారు. కారిడార్‌పై ఈ ఇద్దరు నేతలు ఏం చెబుతున్నారంటే.. ఉప్పల్

రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి: ఎన్‌వీఎస్ఎస్



ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ జాప్యానికి మంత్రి కేటీఆర్, జీహెచ్‌ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం సహాయ నిరాకరణే కారణం. కారిడార్ పూర్తయితే మోదీకి పేరు వస్తుందన్న కారణంతో రాష్ట్రంలో బీజేపీకి క్రెడిట్ దక్కుతుందన్న అక్కసుతోనే సహాయ నిరాకరణ చేశారు. నిన్నటి వరకు విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ లైన్లు, వీధి దీపాలు మార్చలేదు. ఇంకా చాలా మంది భూములు, భవనాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందలేదు. ఒకే జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఒకే ప్రాంతంలోని భూ, భవన నిర్వాసితులకు మూడు రకాల పరిహారం చెల్లించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే. ఒకే ప్రాజెక్టులో ఒకే భూమికి రక రకాలుగా నష్ట పరిహారం అందించిన దాఖలాలు దేశంలో ఎక్కడా లేదు. అంబర్ పేట, ఉప్పల్ కారిడార్‌లు నిర్మాణం పూర్తికాక పోవడం కేటీఆర్ పని తీరుకు దర్పణం పడుతోంది.

ఇబ్బందులు పెట్టారు..

నిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వడానికి కొన్ని రోజులు గ్రామ కంఠం అన్నారు. మరికొన్ని రోజులు వక్ఫ్ భూములన్నారు. ఇలా ఎన్నో పేర్లతో ఇబ్బందులు పెట్టారు. ఎస్ఎన్‌డీపీ, జీహెచ్‌ఎంసీ, రహదారుల శాఖల మధ్య సమన్వయం కుదర్చకపోవడం కేటీఆర్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. రాష్ట్రమంతా జాతీయ రహదారుల అభివృద్ధి శరవేగంగా జరిగింది కదా. మరి ఉప్పల్, అంబర్ పేటలోనే ఎందుకు ఆగిందన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు. నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాల్సింది, భూమి సేకరించి ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రాజెక్టు ప్రారంభ దశలోనే ఆరునెలలోపు భూసేకరణ పూర్తి చేయాలన్న కండిషన్స్‌తోనే ప్రాజెక్టు ప్రారంభమయింది. నల్ల చెరువులో పిల్లర్ల వల్ల జాప్యం అవుతుందేమోనన్న అనుమానంతో అనుమతులు కూడా నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఇప్పించా.

ఎంపీ రేవంత్ రెడ్డి ఎక్కడ?

కేంద్ర ప్రభుత్వ నిధులతో వందల కోట్ల ప్రాజెక్టుల నిర్మాణం తన పార్లమెంట్ పరిధిలో జరుగుతుంటే స్థానిక పార్లమెంట్ సభ్యుడు ఎక్కడున్నాడు? ఏ ఒక్క రోజు పనులను పరిశీలించిన దాఖలాలు కనిపించలేదు. పనుల్లో జాప్యం జరుగుతున్నా, ప్రజలు అనేక రకాలు ఇబ్బందులు పడుతున్నా ఏనాడూ పార్లమెంట్‌లో దీనిపై మాట్లాడక పోవడం దారుణం. ప్రజా సమస్యలు ఎంపీ రేవంత్ రెడ్డికి పట్టవా. కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ ఏనాడూ జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తకపోవడం శోచనీయం.

ప్రజలు నవ్వుకుంటున్నారు...

ఉప్పల్ ప్రజల అవస్థలు చూసి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి పరిస్థితిని వివరించి ఉప్పల్ రహదారి మరమ్మతుల కోసం రూ. 1.69 కోట్లు మంజూరు చేయిస్తే, ముఖ్యమంత్రి తాను పనులు చేయిస్తున్నానంటూ ప్రకటనలు చేయడం హాస్యాస్పదం. దీంతో పాటు స్థానిక ఎమ్మెల్యే కూడా తాను అసెంబ్లీలో చర్చించి పనులకు నిధులు మంజూరు చేయించానంటూ ప్రకటనలు చేయడంపై ప్రజలు నవ్వుకుంటున్నారు.

కేంద్రం తప్పిదాన్ని కప్పి పుచ్చుకునేందుకే: ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి



ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం నారపల్లి నుంచి తీసుకు వచ్చి ఉప్పల్ నడిబొడ్డున బాటిల్ నెక్ వద్ద వదిలేసింది. అక్కడి నుంచి ఎక్కడికి పోవాలే అనే దానిపై స్పష్టత లేకుండా కారిడార్‌ను డిజైన్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.680 కోట్లు పెడితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎక్స్‌టెన్షన్ కారిడార్‌కు (ఉప్పల్ చౌరస్తా నుంచి డీఎస్ఎల్ మాల్ వరకు) రూ. 351 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పనుల్లో ఎక్కడ జాప్యం జరిగిందో చెప్పాలి. ప్రారంభించిన కొంత సమయానికే పనులు పూర్తి చేసి అప్పగించాం. రెండేళ్లలో నష్టపరిహారం అందించాం. గాయత్రి కన్‌స్ట్రక్షన్ కంపెనీ దివాళా తీస్తే దిక్కు లేదు. తమ తప్పులను కప్పి పుచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేస్తే ఎవరూ వినేవారు లేరు. ప్రజలంతా గమనిస్తున్నారు.

నగరంలో 35 కారిడార్లు నిర్మించాం. రహదారి ఛిద్రమైన విషయాన్ని పలు దఫాలుగా మంత్రి కేటిఆర్ దృష్టికి తీసుకు వచ్చి ఉప్పల్ రోడ్డు మరమ్మతులు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్నాం. ఆరు సంవత్సరాలు కాలయాపన చేశారు. ఇప్పటికీ పనులు ఎవరు చేయాలో కేంద్ర ప్రభుత్వానికి స్పష్టత లేదు. పైరోడ్డు కాకుండా కింద రోడ్డయినా వేయండి అంటూ జాతీయ రహదారుల అధికారులకు పలు మార్లు చెప్పినా వినిపించుకోలేదు. చివరకు అసెంబ్లీలో మాట్లాడి రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్నాం. చేత కాకపోతే చెప్పండి రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించి కారిడార్ పనులపై తగు చర్యలు తీసుకుంటాం.

సెప్టెంబరు మొదటి వారంలో..

- సైకిల్ ట్రాక్ ప్రారంభం ఈ నెలలో లేనట్టే..
- ప్రస్తుతం తుది మెరుగుల్లో: హెచ్‌ఎండీఏ కమిషనర్



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అధునాతన సైకిలింగ్ ట్రాక్‌ను సెప్టెంబరు మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ వెల్లడించారు. ట్రాక్ నిర్మాణం పూర్తయిందని, తుది మెరుగులు దిద్దుకుంటోందని ట్విటర్ ద్వారా ఆయన తెలిపారు. ఔటర్‌రింగు రోడ్డును ఆనుకొని నిర్మించిన సైకిల్ ట్రాక్‌ను ఈ నెల 15న ప్రారంభించనున్నట్లు మంత్రి కేటీఆర్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ట్రాక్ పనులు పూర్తి కాకపోవడంతో సెప్టెంబరు మొదటి వారం వరకు గడువు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్, హెచ్‌జీసీఎల్ ఎండీ బీఎల్ఎన్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు ట్రాక్‌ను పరిశీలించారు. దేశంలోనే తొలిసారిగా 23 కిలోమీటర్ల మార్గంలో ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం సైక్లింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఈ నిర్మాణాన్ని చేపట్టింది. గత ఏడాది సెప్టెంబరులో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. రూ.100 కోట్ల అంచనాలతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు రెండు మార్గాల్లో ఉంటుంది. ఔటర్‌ను ఆనుకొని నానక్‌రాంగూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు 8.5 కి.మీ, కొల్లూరు నుంచి నార్సింగి వరకు 14.5 కి.మీ మార్గంలో సైకిల్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. 5.3 మీటర్ల వెడల్పుతో, మూడు లైన్‌లతో నిర్మించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తోన్న సైకిల్ ట్రాక్ నగర ప్రతిష్టను మరింత పెంచుతుందని అధికారులు పేర్కొన్నారు.

పెట్రోలు పోసి తగుల పెట్టారు

సజీవ దహనమా? మృతదేహాన్ని తీసుకొచ్చి కాల్చారా?

- శంషాబాద్‌లోని ఓ ఎన్‌క్లేవ్‌లో దారుణం
- అర్ధరాత్రి డయల్ 100కు సమాచారం
- అప్పటికే పూర్తిగా కాలిపోయిన మహిళ
- నిందితుల వేటలో నాలుగు బృందాలు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో దారుణం చోటు చేసుకుంది. గతంలో 'దిశ' ఘటన చోటు చేసుకున్న ప్రాంతానికి అత్యంత సమీపంలోనే మరో గుర్తు తెలియని మహిళను దుండగులు పెట్రోలు పోసి తగులబెట్టిన ఘటన సంచలనంగా మారింది. పోలీసులు.. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గురువారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పట్టణంలోని శ్రీనివాస్ ఎన్‌క్లేవ్‌కు సమీపంలోని డీటీడీసీ కొరియర్‌లో పని చేస్తున్న యువకుడు శ్రీనివాస్ ఎన్‌క్లేవ్‌లో ఉన్న ఇంటికి వచ్చాడు. సమీపంలోని ఓ భవనం పక్కనే మంటలు చెలరేగుతుండడంతో దగ్గరగా వెళ్లి పరిశీలించాడు. మంటల్లో మహిళ ఉండడంతో వెంటనే తన స్నేహితుడికి ఫోన్ చేసి వివరించాడు. అతడి స్నేహితుడు కూడా వచ్చిన తర్వాత మరోసారి పరిశీలించిన తర్వాత వారు 100 ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. వెంటనే ఆర్‌జీఐఏ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే మహిళ పూర్తిగా కాలిపోయింది. ఘటన స్థలంలోనే అగ్గి పెట్టె లభించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

రాత్రి 11.36 గంటలకు..

పోలీసుల దర్యాప్తులో ఓ సీసీటీవీ ఫుటేజీలో 11.36 గంటల సమయంలో ఓ భవనం వెనక ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మరుక్షణమే మంటల పక్కనుంచి ఓ వ్యక్తి పల్సర్ బైక్‌పై వేగంగా వెళ్లిపోయాడు. ఘటన స్థలానికి మహిళతో పాటు ఒకే వ్యక్తి వచ్చాడా? లేదా మరెవరైనా అదే ప్రాంతంలో ఉన్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్య చేయడానికి సమీపంలోనే ఎక్కడైనా డబ్బాల్లో పెట్రోలు తీసుకొచ్చిన దానిపైకూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. పెట్రోలు బంకుల్లో డబ్బాల్లో పెట్రోలు తీసుకున్న కొందరి అదుపులోకి తీసుకుని విచారించినప్పటికీ ఘటనకు సంబంధం లేనట్లు తేలింది. మహిళను హత్య చేసి తీసుకొచ్చారా? లేక సజీవ దహనం చేశారా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.. మృతురాలి కాలికి ఉన్న పెద్ద సైజు మెట్టెలు మాత్రమే లభ్యమయ్యాయి. దాని ఆధారంగా ఆమె గ్రామీణ ప్రాంతానికి చెందిన మధ్యవయస్కురాలై ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఆర్‌జీఐఏ, శంషాబాద్ రూరల్‌తో పాటు సమీపంలో ఉన్న అని పోలీస్‌స్టేషన్‌లో మధ్యవయస్కురాలైన మహిళలు ఎవరైనా అదృశ్యమైన కేసులను పోలీసులు పరిశీలిస్తున్నారు.



కాలుతున్న మృతదేహం

నాలుగు బృందాలతో గాలిస్తున్నాం

మహిళ హత్య కేసును ఛేదించడానికి నాలుగు బృందాలను ఏర్పాటు చేశాం. అన్ని కోణాల్లో దర్యాప్తు సాగుతోంది. మహిళను హత్య చేసి తీసుకొచ్చి కాల్చేశారా? లేక సజీవ దహనం చేశారా? అన్నది తేలాల్సి ఉంది. మహిళల అదృశ్యం కేసులను కూడా పరిశీలిస్తున్నాం. హత్యకు ముందు తర్వాత సమీపంలో ఉన్న అని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. వీలైనంత త్వరగా నిందితులను పట్టుకుంటాం.

– రాంచందర్‌రావు, శంషాబాద్ ఏసీపీ

రూ.59కే రోజంతా ప్రయాణం

మెట్రో 'సూపర్ సేవర్ ఫ్రీడమ్ ఆఫర్'



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రో రైల్ మరో బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రూ.59కే రోజంతా ప్రయాణం చేసే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం 'సూపర్ సేవర్ ఫ్రీడమ్ ఆఫర్' ప్రవేశపెట్టింది. ప్రయాణికులు రూ.59 చెల్లించి సూపర్ సేవర్ మెట్రో హాలిడే కార్డ్‌ను రీచార్జ్ చేసుకోవచ్చు. ఈ కార్డు ద్వారా ఆగస్టు 12, 13, 15 తేదీల్లో అపరిమితమైన మెట్రో రైడ్‌లను ఎంజాయ్ చేయవచ్చు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రయాణికులు నగరంలో ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా మెట్రోలో ప్రయాణం చేసేందుకు ఈ అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ఎల్‌అండ్‌టీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ హైదరాబాద్ ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికుల కోసం ఎంతో విలువైన ఆఫర్‌ను ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.

ఈజీగా బస్సు జాడ

మొబైల్ యాప్ ద్వారా వివరాలు

- గ్రేటర్‌లో 2850 బస్సులకు జీపీఎస్
- ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారం
- నేడు ప్రారంభించనున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్



సాక్షి, సిటీబ్యూరో/అఫ్జల్‌గంజ్: బస్సు కోసం పడిగాపులు కాస్తున్నారా? మీరు వెళ్లాల్సిన బస్సు ఎప్పుడొస్తుందో తెలియడం లేదా? బస్టాపుల్లోనే గంటల తరబడి ఎదురుచూడాల్సివస్తోందా? ఇక నుంచి ఈ ఇబ్బందులు తొలగిపోనున్నాయి. మొబైల్ యాప్ ద్వారా ఈజీగా బస్సు జాడను కనిపెట్టే సదుపాయం అందుబాటులోకి రానుంది. గ్రేటర్‌లోని అన్ని బస్సులకు వెహికిల్ ట్రాకింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. దీంతో ఏ బస్సు ఎక్కడ ఉంది. ఎంత సేపట్లో తాము ఎదురు చూస్తున్న బస్టాప్ వద్దకు చేరుకుంటుందనే సమాచారం ప్రయాణికులకు మొబైల్ యాప్‌లో లభించనుంది. కొద్ది రోజులుగా ప్రయోగాత్మకంగా పరిశీలించిన వెహికల్ ట్రాకింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్రతి బస్సును జీపీఎస్‌తో అనుసంధానం చేయడం వల్ల ఏ క్షణంలో బస్సు ఎక్కడుందో తెలుసుకొనే సదుపాయం లభించనుంది. ఇందుకు సంబంధించిన టీఎస్‌ఆర్టీసీ వెహికిల్ ట్రాకింగ్ మొబైల్ యాప్‌ను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ శనివారం మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ప్రారంభించనున్నారు. నగరంలోని వివిధ మార్గాల్లో తిరిగే సుమారు 2850 బస్సులతో పాటు ఎంజీబీఎస్, జేబీఎస్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే మరో 2500లకుపైగా బస్సుల్లో వెహికిల్ ట్రాకింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది.

ఇంటి నుంచే ఈజీ జర్నీ..

వెహికల్ ట్రాకింగ్ మొబైల్ యాప్‌ను ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల ప్రయాణం ఎంతో తేలిక. ఉదాహరణకు ఉప్పల్ నుంచి మెహిదీపట్నంకు వెళ్లవలసిన ప్రయాణికుడు '113ఎం'పైన క్లిక్ చేస్తే ఆ రూట్‌లో నడిచే బస్సుల వివరాలన్నీ తెలుస్తాయి. ఉప్పల్ నుంచి మెహిదీపట్నంకు వెళ్లేందుకు ఏ బస్సు ఏ సమయంలో బయలుదేరుతుందో తెలిసిపోతుంది. అలాగే ఇప్పటికే ఆ రూట్‌లో నడుస్తున్న బస్సులు ఎక్కడున్నాయో కూడా ప్రయాణికులు తెలుసుకోవచ్చు. దీనిద్వారా ఇంటి నుంచి బయలుదేరే సమయంలోనే ప్రయాణాన్ని ప్లాన్ చేసుకొనే వెసులుబాటు లభిస్తుంది. ఎయిర్‌పోర్టు నుంచి సిటీలో ఎక్కడికైనా వెళ్లేందుకు మొబైల్ యాప్ ద్వారా బస్సుల స్టేటస్‌ను తెలుసుకోవచ్చు. అన్ని బస్సుల్లో కూడా వెహికిల్ ట్రాకింగ్ వ్యవస్థ ఉంటుంది.

మళ్లీ 'టీఅండ్‌టీ'

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇక్కట్లకు చెక్

- నేతృత్వం వహించనున్న అడిషనల్ కమిషనర్



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో త్వరలోనే ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ (టీఅండ్‌టీ) విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. నగరంలో జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణలు, తదితరాల కోసం గతంలో కూడా టీఅండ్‌టీ విభాగం ఉన్నప్పటికీ, అకస్మాత్తుగా దాన్ని రద్దు చేశారు. ఏయే ప్రాంతాల్లో ట్రాఫిక్ చిక్కులు ఎక్కువగా ఉన్నాయో గుర్తించడంతోపాటు చిక్కుల పరిష్కారానికి సర్వే నిర్వహించి రహదారుల విస్తరణ తదితరమైన పనుల్ని అది చేసేది. అది రద్దయ్యాక ఇంజినీరింగ్ మెయింటెనెన్స్ విభాగమే ఈ పనులు నిర్వహిస్తోంది. రద్దు చేసిన టీఅండ్‌టీని వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ)లో విలీనం చేశారు.

వీరు వేస్తుంటే.. వారు తొలగిస్తున్నారు

ఇటీవలి కాలంలో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేస్తున్న సదుపాయాలను ట్రాఫిక్ పోలీసులు తొలగిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో సైక్లింగ్ ట్రాక్స్‌ను పోలీసులు తొలగించడంపై తీవ్ర దుమారం చెలరేగింది. మంత్రి కేటీఆర్ ఇటీవల నిర్వహించిన సమావేశంలోనూ ఇది ప్రస్తావనకొచ్చినట్లు తెలిసింది. అంతేకాకుండా స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, రంబుల్ స్ట్రిప్స్, యూటర్న్‌ల ఏర్పాటు వంటి అంశాల్లోనూ పోలీసులదే పైచేయిగా ఉంటుండంతో వారు చెప్పినట్లే జీహెచ్‌ఎంసీ అధికారులు వినాల్సి వస్తోంది. ప్రమాదాల నియంత్రణ కోసం పోలీసులు సూచిస్తుండగా, ప్రమాణాలకు తిలోదకాలిస్తూ జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు ఏర్పాట్లు చేస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు పెరుగుతున్నాయి. ప్రమాదభరితంగా ఉన్న రంబుల్‌స్ట్రిప్స్‌ను తొలగించాల్సిందిగా మంత్రి ఆదేశించినప్పటికీ ఇంతవరకు అమలు చేయలేకపోయారు. కొత్తవి ఏర్పాటు చేయవద్దని నిర్ణయం తీసుకున్నారు తప్ప ఉన్నవాటిని తొలగించలేదు.

యూటర్న్‌లతో పెరిగిన దూరం

కొన్ని ప్రాంతాల్లో సిగ్నళ్లు మూసివేసి దాదాపు కిలోమీటర్ దూరంలో యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. దీనివల్ల సౌలభ్యం కంటే ఇబ్బందులే ఎక్కువగా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

గతంలో బల్దియాలోని టీఅండ్‌టీ విభాగం, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేసే వారని, అన్ని విభాగాలతో కూడిన సమన్వయకమిటీ పర్యటనలతోనూ సమస్యలకు పరిష్కారం లభించేదని మంత్రి వద్ద జరిగిన సమావేశంలో పోలీసు ఉన్నతాధికారులు ప్రస్తావించినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు పోలీసుల సహకారం సమన్వయంతో పనిచేసేందుకు అడిషనల్ కమిషనర్ నేతృత్వంలో జీహెచ్‌ఎంసీలో టీఅండ్‌టీ విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి కేటీఆర్ సూచించినట్లు తెలిసింది. మరోవైపు జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండా ఎవరూ ఎలాంటి పనులు కూడా చేయవద్దని, ముందు జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతి పొందాకే పనులు చేయాలని కూడా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అడిషనల్ కమిషనర్ నేతృత్వంలో టీఅండ్‌టీ విభాగం కొత్తగా ఏర్పాటు కానున్నట్లు తెలిసింది.

కొంపల్లిలో అమానుషం

- ఏడేళ్ల చిన్నారిపై తండ్రీ కొడుకుల లైంగిక దాడి
- అస్వస్థతకు గురైన బాలిక..
- గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

కుత్బుల్లాపూర్: ఇంటి పక్కనే ఉంటున్న ఏడేళ్ల చిన్నారిపై కామాంధులైన తండ్రీ కొడుకులిద్దరు అమానుషానికి పాల్పడ్డారు. సభ్యసమాజం తలదించుకునేలా అభంశుభం తెలియని చిన్నారిపై అఘాయిత్యానికి ఒడిగట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కొంపల్లి ప్రాంతంలో ఓ నిరుపేద కుటుంబం అద్దెకు ఉంటుండగా..వీరికి ఏడేళ్ల వయసున్న చిన్నారి ఉంది. వీరింటి పక్కనే కర్నాటకకు చెందిన శివకుమార్(42) నివాసం ఉంటున్నాడు. ఈయనకు శామ్యూల్(21) అనే కుమారుడు ఉన్నాడు. వీరిద్దరి కన్ను చిన్నారిపై పడింది. తల్లిదండ్రులు కూలిపనులకు వెళ్లిన సమయంలో మొదట కుమారుడు బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి మొబైల్ ఫోన్‌లో అశ్లీల వీడియోలు చూపించి లైంగికిదాడికి పాల్పడ్డాడు. అడ్డుకోవాల్సిన తండ్రి కూడా పశువులాగా ప్రవర్తించి కుమారుడికి సహకరించాడు. ఆ తర్వాత తానూ లైంగిక దాడికి పాల్పడ్డాడు. సాయంత్రం సమయంలో ఇంటికి చేరుకున్న చిన్నారి తల్లిదండ్రులు బిడ్డ అస్వస్థతకు గురవడాన్ని గమనించారు. వెంటనే స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్లగా రక్తం కారుతున్న విషయాన్ని గుర్తించారు. జరిగిన విషయాన్ని అమాయకంగా ఆ చిన్నారి చెప్పడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి 9 గంటల సమయంలో పోలీసులు లైంగిక దాడికి పాల్పడిన తండ్రీ కొడుకులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఫేక్ కాల్‌సెంటర్ల గుట్టురట్టు

- అమెరికా సిటిజన్లే టార్గెట్‌గా కార్యకలాపాలు
- రెండు కంపెనీలపై కేసులు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తదితరులు

హఫీజ్‌పేట్: మాదాపూర్‌లో రెండు ఫేక్ ఇంటర్నేషనల్ కాల్ సెంటర్ల గుట్టు రట్టు చేశామని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదాపూర్ మెడికవర్ హాస్పిటల్ వెనుక రెండు ఫేక్ కాల్ సెంటర్లను సీజ్ చేసినట్లు చెప్పారు. గుజరాత్‌కు చెందిన మహ్మద్ అన్సారీ, అకిబ్‌లు ఏజీ సొల్యూషన్ సంస్థను, ప్రదీప్ వినోద్ రాథోడ్, ఉస్మాన్ ఘనీ ఖాన్, శివం ప్రధాన్, దీపు తపార్, మెయిన్ ఖాన్, సాగర్ చౌదరి, నగరంలోని ఓల్డ్‌సిటీకి చెందిన జుబేర్‌లు వర్టెజ్ సొల్యూషన్స్ సంస్థలు నడుపుతూ ఫేక్ కాల్‌సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ రెండు సంస్థలను గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో రిజిస్ట్రేషన్ చేయించారు. కంపెనీలో కాల్ సెంటర్‌లో పనిచేయడానికి వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురిని ఉద్యోగులుగా నియమించుకున్నారు. వీరు అమెరికా, కెనడా తదితర దేశాలకు చెందిన సిటిజన్ల డేటా సేకరించి ఫేక్ కాల్స్ చేసి బెదిరిస్తున్నారు.

కస్టమర్ కేర్ కాల్ సెంటర్ నుంచి మాట్లాడుతున్నామంటూ...

విదేశీయుల డేటా సేకరించిన తర్వాత రోజు కొన్ని వేల మందికి ఇంటర్నెట్ కాలింగ్ చేసి మీకు మెక్సికో నుంచి పార్సిల్ వచ్చిందని తెలుపుతారు. అనంతరం మరో కాల్ సెంటర్ నుంచి తాము యూఎస్ కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్ సెల్ విభాగం నుంచి మాట్లాడుతున్నామని మీ పార్సిల్‌ను స్కాన్ చేస్తే దానిలో మత్తు పదార్థాలు, చట్ట విరుద్ధమైన వస్తువులు ఉన్నాయని..మీపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని బెదిరించి వారి పూర్తి చిరునామా, జిప్ కోడ్‌లు సేకరిస్తారు. మరికొందరికి మీరు అక్రమ లావాదేవీలు జరుపుతున్నారని చెప్పి బెదిరిస్తారు. మీపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండాలంటే మీరు గిఫ్ట్ కార్డులు, ఆమెజాన్ ఓచర్లు తీసుకుని పంపించాలని చెబుతారు. అలా భయంతో కస్టమర్లు పంపిన గిఫ్ట్ కార్డులు, ఓచర్లను పాక్స్‌ఫుల్ వెబ్‌సైట్ ద్వారా డిస్కౌంట్ ధరకు ఇచ్చేసి క్రిప్టో కరెన్సీ తీసుకొని ట్రస్ట్ ద్వారా డబ్బులు పొందుతున్నారు. ఈ విధంగా క్రిప్టో నుంచి హవాలా ద్వారా వివిధ ప్రాంతాలకు డబ్బులు పంపించి తీసుకుంటున్నారు. వర్టెక్స్ సొల్యూషన్స్ సంస్థ వారు కూడా ఇదే తరహాలో మోసాలకు పాల్పడుతున్నారు.

భారీగా కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం...

ఫేక్ కాల్ సెంటర్ నిర్వహిస్తున్న సంస్థల నుంచి భారీ సంఖ్యలో కంప్యూటర్లు, 27 సెల్‌ఫోన్లు, రూ.2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 115 మందిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. కాగా ఫేక్ కాల్ సెంటర్ల గుట్టురట్టు చేసిన మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, ఎస్‌ఐలు గౌతమ్, రవికిరణ్, నర్సింహారావు, వెంకటేష్, శ్వేత, పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో మాదాపూర్ డీసీపీ సందీప్‌రావు, అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూకు గేట్స్ ఫౌండేషన్ భారీ గ్రాంట్

రాయదుర్గం: వివిధ పరిశోధనల నిమిత్తం హెచ్‌సీయూకు అమెరికాలోని గేట్స్ ఫౌండేషన్ భారీ గ్రాంట్‌ను మంజూరు చేసింది. కోవిడ్ ఇన్‌ఫెక్షన్ల వ్యాప్తిని అరికట్టడం, తీవ్రతను తగ్గించడమే లక్ష్యంగా చేసే పరిశోధనల కోసం రెండేళ్లకు గాను రూ.1.5 కోట్లు మంజూరయ్యాయి. మొదటి విడతగా రూ.71 లక్షలు హెచ్‌సీయూ అందుకుంది.

నేడు, రేపు రొబోటిక్ సర్జరీలపై సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రుమా సిన్హా

బంజారాహిల్స్: రొబోటిక్ సహాయక శస్త్ర చికిత్సలలో గైనకాలజిస్ట్‌లకు శిక్షణా నైపుణ్యం కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 12, 13 తేదీల్లో రొబోటిక్ గైనకాలజికల్ సర్జరీపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ రుమా సిన్హా తెలిపారు. బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... అసోసియేషన్ ఆఫ్ గైనకాలజికల్ రొబోటిక్ సర్జన్స్ ఆఫ్ ఇండియా సహకారంతో రెండు రోజుల సదస్సును గచ్చిబౌలిలోని షెర్టన్ హోటల్‌లో నిర్వహిస్తామన్నారు. స్త్రీ జననేంద్రియ రుగ్మతలకు చికిత్స చేయడంలో తాజా పద్ధతులను, క్లినికల్ అప్లికేషన్‌తో దేశం అంతటా ఉన్న వైద్యులకు ఈ కాన్ఫరెన్స్ పరిచయం చేయనుందని అన్నారు. దేశంలో మొదటిసారి ఇండో యురోపియన్ డిప్లొమాను పరిచయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జోయింగ్, మణిదీప్ సింగ్ కుమార్, డాక్టర్ రామజోషి తదితరులు పాల్గొన్నారు. వర్ధమాన సర్జన్లతో సహా 150 మంది డాక్టర్లు ఇందులో పాల్గొంటారని ఇంటరాక్టివ్ సిమ్యులేషన్ వర్క్‌షాప్‌లను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.

స్పైన్ ఎండోస్కోపి సదస్సుకు 300 మంది సర్జన్లు



మాట్లాడుతున్న డాక్టర్ అలోక్ రంజన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.5లోని ర్యాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో శుక్రవారం స్పైనోస్కోప్-2023 అడ్వాన్స్‌డ్ స్పైన్ ఎండోస్కోపి సదస్సు నిర్వహించారు. దేశ, విదేశాల నుంచి 300 మంది సర్జన్లు ఈ సదస్సులో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో మ్యాక్స్‌విజన్ కంటి ఆస్పత్రి చీఫ్ కాటరాక్ట్ డాక్టర్ కాసు ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ అలోక్ రంజన్, డాక్టర్ సుకుమార్ సూర, డాక్టర్ లోకేశ్వర్‌రావు సజ్జతో పాటు ఏషియన్ స్పైన్ ఆస్పత్రి సీఈవో నరేష్ కూడా పాల్గొన్నారు. ఇందులో భాగంగా అత్యాధునిక పద్ధతులతో తాము నిర్వహిస్తున్న సర్జరీలపై డాక్టర్ సుకుమార్ సూర వివరించారు. ఈ రెండు రోజుల సదస్సులో స్పైనల్ సర్జరీల్లో వస్తున్న అధునాతన టెక్నాలజీతో పాటు వివిధ పరికరాలపై చర్చిస్తున్నట్లు వారు తెలిపారు.

నిషేధిత ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న ముఠా అరెస్టు



నిందితుడు షేక్ అస్లాం తదితరులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లోని ఒలంపియా పాన్‌షాప్‌లో నిషేధిత ఈ-సిగరెట్లను విక్రయిస్తున్న నిర్వాహకుడితో పాటు మరో నలుగురిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్‌చేసి జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. పాన్‌షాప్ యజమాని షేక్ అస్లాం ఎలక్ట్రానిక్ సిగరెట్లతో పాటు హుక్కా ఫ్లేవర్స్‌ను విద్యార్థులకు, ఐటీ ఉద్యోగులకు, యువతకు విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందింది. దీంతో పోలీసులు ఈ పాన్‌షాప్‌పై దాడి చేసి రూ.2 లక్షల విలువ చేసే 41 ఈ-సిగరెట్లను ఈ-సిగరెట్ల లిక్విడ్ ఫ్లేవర్స్‌ను, హుక్కా ఫ్లేవర్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. షేక్ అస్లాంతో పాటు రహీల్‌ఖాన్(19), రిషి అగర్వాల్(21), శ్రేయన్ష్ అగర్వాల్(21) అనే ముగ్గురు విద్యార్థులను అరెస్ట్ చేశారు. మొగల్పురాకు చెందిన ఎండీ షోయబ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

హఫీజ్‌పేట్‌లో చెడ్డీ గ్యాంగ్ కదలికలు?

విల్లాస్‌లో చోరీ



వసంత్ విల్లా 75లో సీసీ కెమెరాల్లో దుండగుల దృశ్యాలు

మియాపూర్: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మియాపూర్ సీఐ ప్రేమ్ కుమార్ తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. హఫీజ్‌పేట వసంత్ విల్లాస్‌లోని 75వ విల్లాలో రామ్‌సింగ్ కుటుంబం నివాసం ఉంటోంది. రాంసింగ్ కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 6న ఉదయం 10 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి కామారెడ్డికి వెళ్లాడు. 7వ తేదీన సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంట్లో దొంగతనం జరిగిందని గ్రహించారు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా గుర్తు తెలియని నలుగురు దొంగలు ఇంట్లోకి వచ్చినట్లు తెలిసింది. అందరు చెడ్డీలపై ఉన్నారు. 6వ తేదీన అర్ధ రాత్రి ఇంటి వెనక ఉన్న వెంటిలేటర్ అద్దాలను పగులగొట్టి ఇంట్లోకి చొరబడిన చెడ్డీ గ్యాంగ్ ఇంట్లో ఉన్న విలువైన వస్తువులతో పాటు 30 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు తెలిపారు. వెంటనే మియాపూర్ పోలీసులకు డాక్టర్ రామ్‌సింగ్ ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో అక్కడికి చేరుకొని పరిశీలించారు. బాధితుడు రామ్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ముమ్మరం చేశామని తెలిపారు. దొంగలు ఇతర రాష్ట్రాలకు చెందినవారుగా గుర్తించారు. సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని, బృందాలుగా విభజించి గాలింపు చర్యలు చేపట్టామని త్వరలోనే వారికి పట్టుకుంటామని సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

వేధిస్తే శిక్ష తప్పదు

- 59 మంది పోకిరీలు అరెస్టు
- డెకాయ్‌లో మరో 108 మంది
- తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్

సాక్షి, సిటీబ్యూరో: అమ్మాయిలు, మహిళలను వేధిస్తున్న పోకిరీలపై రాచకొండ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. తొలిసారి తప్పిదానికైతే తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నారు. పునరావృతమైతే ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి, శిక్షపడేలా చేస్తున్నారు. శుక్రవారం రాచకొండ షీ టీమ్స్ 59 మంది ఆకతాయిలను అరెస్టు చేసి, ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ ఆఫీసులో కౌన్సిలింగ్ నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, బహిరంగ ప్రదేశాలు వంటి చోటే కాదు ఆన్‌లైన్‌లోనూ ఆకతాయిలు మహిళలను వేధిస్తున్నారని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి. ఉషారాణి తెలిపారు. షీ టీమ్స్‌కు మొత్తం 197 ఫిర్యాదులు రాగా.. వీటిల్లో 30 ఫోన్ వేధింపులు, 40 వాట్సాప్, మెసేజ్‌ల ద్వారా, 20 సోషల్ మీడియా యాప్‌ల ద్వారా, 28 ఇతరత్రా మార్గాల ద్వారా వేధించిన ఫిర్యాదులు అందాయని ఆమె వివరించారు. వీటిల్లో 44 క్రిమినల్, 29 ఈ-పెట్టీ, 45 కౌన్సిలింగ్ కేసులను నమోదు చేశామని చెప్పారు. అలాగే మఫ్టీలో బహిరంగ ప్రదేశాలలో డెకాయ్ ఆపరేషన్లు చేసి 108 మంది పోకిరీలను పట్టుకున్నామని, వీరికి కూడా కౌన్సిలింగ్ ఇచ్చామని పేర్కొన్నారు.

అధ్యాపకుల పదవీ విరమణ వయసు పెంచాలని వినతి



బంజారాహిల్స్: చాల కాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకుల పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలకు పెంచాలని డా.బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ఫ్యాకల్టీ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈమేరకు వార శాసన మండలి ఉపాధ్యక్షులు డా.బండ ప్రకాష్‌కు వినతి పత్రాన్ని అందించారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి ఆయన విశ్వవిద్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా అధ్యాపకులు కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన సమస్యల పట్ల సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం త్వరలోనే కీలక నిర్ణయం తీసుకోనుందని, ఈ రెండు సమస్యలను కూడా విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ప్రొ. గుంటి రవి, ప్రధాన కార్యదర్శి డా. రబీంద్రనాథ్ సోలమన్, సభ్యులు ప్రొ. సుధారాణి, ప్రొ.పుష్పా చక్రపాణి, ప్రొ.షకీలా ఖానం, డా. పరాంకుశం వెంకట రమణ, డా.పల్లవి కబ్డే పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ తుపాకీతో భార్యను బెదిరించిన భర్త

బంజారాహిల్స్ : లైసెన్స్ కలిగిన తుపాకీ చూపించి భార్యను బెదిరించిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. టోలిచౌకి మిరాజ్ కాలనీకి చెందిన షేక్ మహ్మద్ షాహిద్ వ్యాపారి. అతని కుమార్తె సమీర జబీనను టోలిచౌకి బాల్‌రెడ్డినగర్‌కు చెందిన జవాజ్‌కు ఇచ్చి 2015లో వివాహం జరిపించాడు. అప్పటి నుంచి జవాజ్ తన భార్యను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. పలు మార్లు మత పెద్దలు కౌన్సెలింగ్ ఇచ్చినా అతని తీరు మారలేదు సరికదా.. తన లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో జబీన కుటుంబ సభ్యులందర్నీ చంపేస్తానని బెదిరించేవాడు. దీంతో 15 రోజుల క్రితం జబీన అత్తవారింటి నుంచి వచ్చి తండ్రి వద్ద ఉంటుంది. జవాజ్ అక్కడకు కూడా వచ్చి గొడవ చేస్తుండటంతో షాహిద్ తన కుమార్తెను బంజారాహిల్స్ రోడ్డు నెంబరు3లోని గ్లోరి గెస్టు హౌస్‌కు మార్చాడు. ఈ నెల 10న కుమార్తె గెస్టు హౌస్‌లో ఉంచి షాహిద్ బయటకు వెళ్లాడు. ఇదే సమయంలో అక్కడకు వచ్చిన జవాజ్ రివాల్వర్‌ను భార్య నుదిట మీద ఎక్కుపెట్టి చంపేస్తానని బెదిరించాడు. జబీన 100 డయల్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు జబీనను రక్షించి.. ఆమె ఫిర్యాదు మేరకు జవాజ్ పై ఐపీసీ 498-ఎ, 506, ఆయుధాల చట్టం 30 కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.